దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి: 3 | సంచిక : 241 | సోమవారం 07. 9. 2026 | ఎడిటర్ వేమల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00


## కాంగ్రెస్‌లో మరో నలుగురు నేతలకు షోకాజ్ నోటీసులు

కాంగ్రెస్ పార్టీలో మరో నలుగురు నేతలకు షోకాజ్ నోటీసులు అందాయి. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్‌కు క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారని నోటీసులు అందజేసింది. గత కొంతకాలంలో ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఉట్నూరులో ఇటీవల జరిగిన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఈ ఇద్దరు నేతల మధ్య వాగ్వాగం జరిగింది. సమావేశానికి ఆహ్వానం లేకపోయినా సంజీవరెడ్డి వచ్చారంటూ కంది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలోనే ఒకరినొకరు దూషించుకున్నారు. దీంతో వివరణ కోరుతూ ఇద్దరికీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు గజ్వేల్ నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి సైతం క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. నర్సారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మల్లారెడ్డి పీసీసీకి ఫిర్యాదు చేయడంతో ఇద్దరికీ నోటీసులు ఇచ్చారు. వారం లోపు నేతలు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే మంత్రి పదవి నుండి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో పార్టీ నేతల్లో గుబులు పుట్టగా తాజాగా మరికొందరు నేతలకు నోటీసులు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.



# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్ ఫ్లాప్

## మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

- పార్టీ ఎవరికి బీఫాం ఇచ్చినా గెలిచే పరిస్థితి: బీఆర్ఎస్ఎల్పీ భేటీలో కేసీఆర్
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- సాగునీటి కోసం లక్షలాది మందితో త్వరలో ప్రత్యక్ష కార్యాచరణ
- హామీల అమలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, తాగునీరు, ఉద్యోగుల సమస్యలపైనా పోరాటం
- అసెంబ్లీ, మండలిలో ప్రజల గొంతు వినిపించాలి..
- కాళేశ్వరం, పాలమూరు-- రంగారెడ్డిపై ప్రభుత్వాన్ని నిలదీయాలి
- ఎర్రవెల్లిలో నేతలకు అధినేత దిశానిర్దేశం

**తొలి సమయం హైదరాబాద్**
అసెంబ్లీ సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పకుండా హాజరుకావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆం దిశానిర్దేశం చేశారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశాలను ఎవరూ లైట్ తీసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలి. కాంగ్రెస్, భాజపా విధానాలను ఎండగట్టాలి. స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలపై నిలదీయాలి. కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్. తమ ప్రభుత్వం మళ్లీరాదని కాంగ్రెస్ నేతలకు అర్థమైంది. అందుకే అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. నా చావు కోరుతూ పదేపదే మాట్లాడుతున్నారు. పాలన చేతకాకే రేవంత్‌రెడ్డి బూతు పురాణం. అలాంటి వ్యక్తితో చర్చకు అసెంబ్లీకి రావాలా?సమావేశాల్లో అధికార పార్టీ నేతలు నా గురించి మాట్లాడే యత్నం చేస్తే పట్టించుకోవద్దు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాల పైనే పోరాడాలి. రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోంది. కృష్ణా, గోదావరి జలాల అంశంపై ఉద్ధృత పోరాటం చేయాలి. రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదు?

## ఉద్యోగుల ఆరోగ్యభద్రత ప్రభుత్వ ప్రాధాన్యం

- ఈహెచ్ఎస్ అమలులో రాజీ ప్రసక్తే లేదు
- ప్రస్తుతం 354 ప్రైవేట్ ఆస్పత్రులు..
- త్వరలో మరిన్ని ఆస్పత్రుల చేరికకు చర్యలు
- ట్రస్టు బోర్డు భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ తెలంగాణ వాణి)



**తొలి సమయం హైదరాబాద్**
ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యభద్రత విషయంలో ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలులో ఎలాంటి రాజీ ఉండదని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆదివారం మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్‌లో ఈహెచ్ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లకు అనారోగ్య సమయంలో ఆర్థిక, మానసిక ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్య భద్రత కల్పించాలన్న ఉద్దేశంతోనే హెల్త్ స్కీమ్ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈహెచ్ఎస్ పథక రూపకల్పన, విధివిధానాలపై ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాకే విధివిధానాలు ఖరారు చేశామని భట్టి తెలిపారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే ఈహెచ్ఎస్‌లో 354 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయని, మరికొన్ని ఆస్పత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్టు వెల్లడించారు. ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో అధికారులు సమావేశాలు నిర్వహించి పథకం సజావుగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను గత పదేళ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని హెల్త్‌కార్డు పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఉ

## పనితీరు బట్టే పదవులు

కేబినెట్ విస్తరణ కసరత్తు !?

అసెంబ్లీ సమావేశాలు ముగియగానే కార్యాచరణ

ప్రస్తుతం కేబినెట్‌లో మూడు ఖాళీలు

నామినేటెడ్ పదవులు కూడా ఒకేసారి భర్తీ



**తొలి సమయం హైదరాబాద్** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టానికి తెరలేపుతోంది. మంత్రివర్గంలో మార్పుచేర్పులు ,ఖాళీల భర్తీ పక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తుది అనుమతి లభించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగియగానే ఈ విస్తరణ పక్రియను పూర్తి మిగతా 2లో..



## రాజీనామా చేయండి

**తొలి సమయం హైదరాబాద్**
హైదరాబాద్: ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కు పరిమితమైన బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు వెంటనే తన ప్రధాన ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. అధికారం, ప్రభుత్వాలు, పదవులు శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్ష నేతకు చాలా గౌరవం ఉంటుందని, అలాంటి పదవిని అపహాస్యం చేయవద్దని హితవు పలికారు. అసెంబ్లీకి రాని కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ సలహాదారు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్‌లతో పాటు ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జగ్గారెడ్డి అంజన్‌కుమార్ యాదవ్, పలువురు డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 'మా అసెంబ్లీ వ్యూహాన్ని ఖరారు చేసుకున్నాం'

### బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు

**తొలి సమయం హైదరాబాద్**



రేపట్నుంచి(సోమవారం, సెప్టెంబర్ 07వ తేదీ) ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేసుకున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. ఈరోజు ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం అనంతరం హరీష్ మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ నష్టం చేసిందని, ఆ పార్టీ ప్రజలకు చేసిన ద్రోహాల మీద అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. 'ఈ అసెంబ్లీ కనీసం నెల పెట్టాలని మేము బీఏసీలో డిమాండ్ చేయబోతున్నాం. కాంగ్రెస్ పార్టీ ద్రోహాల మీద నిలదీస్తాం. 22ఏ అంశం పై కూడా ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాబోయే కొద్ది రోజుల్లో లక్షలాది మందితో కాళేశ్వరం ఎత్తిపోతల, రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగనున్నారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు. రాజీనామా చేయాల్సి వస్తే మీరే చేయాలి. అన్ని విషయాల్లో ఫెయిల్ అయిన మీరే రాజీనామా చేయాలి.ప్రధాన ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వడం లేదు. సీఎం బూతులు తిడుతున్న ఈ సభ కు కేసీఆర్ రావాల్సిన అవసరం లేదు అని అందరం ఎమ్మెల్యేం చెప్పాం. మీ తమ్ముడు కనీసం వార్డు మెంబర్ కూడా కాదు. ఆయనకు ఎందుకు గన్‌మెన్‌లను ఇచ్చి ఖర్చు పెడుతున్నారు. అసెంబ్లీ కనీసం నెలరోజులు జరగాలని మేము స్పీకర్ ను కోరుతాం.సభలో మాకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను అడుగుతాం. మాకు తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా వెనకాడం' అని హెచ్చరించారు.

## దేశానికి తలమానికం ఏఐ డేటా సెంటర్


రూ.70 వేల కోట్ల పెట్టుబడి

7 వేల మందికి ఉద్యోగాలు

టీసీఎస్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం



**తొలి సమయం హైదరాబాద్** హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో శనివారం సచివాలయంలో సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో మిగతా 2లో..




## 4 రాష్ట్రాల్లో జనగణన

### ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

న్యూఢిల్లీ, తొలి సమయం: కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన పక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల పక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక పక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

## కేసీఆర్ దారిలో రేవంత్ సర్కార్

సర్కార్ భూదందా

2ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, తొలి సమయం: సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని మిగతా 2లో..

# డోర్నకల్ గళాన్ని ఢిల్లీకి వినిపించిన చీకటి మహేష్ గౌడ్

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కీలక భేటీ - అభివృద్ధి పనులకు హామీ



**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 06;**

మహబూబాబాద్ జిల్లా బీజేపీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. మానుకోట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ ఆదివారం ఉదయం భాగ్యనగర్ లోని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ కేవలం మర్యాదపూర్వక భేటీగానే కాకుండా డోర్నకల్ నియోజకవర్గ భవిష్యత్తుకు సంబంధించిన కీలక చర్చగా మారింది. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని మహేష్ గౌడ్ కేంద్ర మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయి పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల మధ్య సమన్వయం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా డోర్నకల్ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలు, రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు, సహకారం అందించాలని వినతిపత్రంలో కోరినట్లు సమాచారం. మహేష్ గౌడ్ వినతిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి ప్రజలకు మేలు జరిగేలా తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన తర్వాత మాట్లాడిన చీకటి మహేష్ గౌడ్ డోర్నకల్ నియోజకవర్గంలో పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. మహేష్ గౌడ్ ఢిల్లీ స్థాయిలో చేస్తున్న ఈ ప్రయత్నాలతో డోర్నకల్ బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. కేంద్ర మంత్రి హామీతో త్వరలోనే నియోజకవర్గానికి మంచి రోజులు వస్తాయని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒడ్డిరాజు రామచంద్రరావు, బీజేపీ దంతాలపల్లి మండల అధ్యక్షులు గుండగాని భరత్ గౌడ్, బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకులు నెమ్మది రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే

- ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎర్రం శ్రీనివాస్.
- ప్రభుత్వ విప్ డా. రామచంద్రు నాయక్.



**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 6:**

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని అక్షర హై స్కూల్ లో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రు నాయక్ హాజరై పలువురు ఉపాధ్యాయులకు అవార్డ్ అందజేస్తూ శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అత్యంత గౌరవ ప్రదమైనది ఉపాధ్యాయ వృత్తే అన్నారు. భవిష్యత్ తరాలను నిర్మించేది ఒక్క ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని కొనియాడారు. తల్లి, తండ్రి తర్వాత గురువుకు మన సమాజంలో గొప్ప స్థానం కల్పించబడిందని అలాంటి ఉన్నతమైన స్థానంలో ఉన్నందుకు అందరికీ అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ప్రతినిధులతో పాటు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్ర యాకాంతం గౌడ్ , సంఘ ప్రతినిధులు ,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ సీనియర్ నాయకుని తల్లికి సమ్మయ్య గౌడ్ నివాళి

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 6:**

కేసముద్రం మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుగుడు వీరాస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్ తల్లి తిరుగుడు బక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ బక్కమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకునికి కార్యకర్తకు అండగా ఉంటుందని తెలిపారు. సంతోషంలో కాదు బాధలో మీ భుజం తట్టి మీ పక్కన నిలబడతామని భరోసా ఇచ్చారు. గ్రామాలలో ఎవరికి ఏ కష్టం వచ్చిన సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు అందరు సమన్వయం చేసుకుంటూ బాధితులకు అండగా ఉండాలని సూచించారు. అందరు సంఘటితమై బాధలేని లోటును పూడ్చాలని పిలుపునిచ్చారు. కంటికి రెప్పలా ప్రతి ఒక్కరిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. సమ్మిగౌడ్ వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు దయాకర్,గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, వార్డు నెంబర్స్ కంచ రాజు, పలస పద్మా వెంకన్న, తండా సంపత్, యువత అధ్యక్షులు తండా శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అరిగే విజేందర్, పబ్బతి సారంగం, అడప రమేష్, ఏటురోజు పరిపూర్ణ చారి,పబ్బతి శ్రీనివాస్,పలస నాగేష్,బట్టు మురళి, కంకల కొమురయ్య, ఆవుల బాబు, పబ్బతి శ్రీనివాస్,కంచ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# జగదాంబ గుంపులో ఘనంగా శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవం

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్తులు. కన్నులపండువగా సాగిన వేడుకలు.**

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 06:**

ఇల్లందు మండలం ,సుదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని జగదాంబ గుంపులో శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, బోనాల సమర్పణతో పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.





**సోదరభావానికి ప్రతీకగా ఆలయ నిర్మాణం.**

గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజ సుకనయ్యతో పాటు మెట్టెల వారి అన్నదమ్ములు, గ్రామ ప్రజలు సోదంభావంతో ఐక్యంగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణాన్ని చేపట్టడం విశేషంగా నిలిచింది. గ్రామ ప్రజలంతా కలిసి కట్టుగా ఆలయ నిర్మాణంలో భాగస్వాములై, అనంతరం అమ్మవారి బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు.

గ్రామంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సంప్రదాయాలను కొనసాగించేలా బోనాల ఉత్సవాన్ని నిర్వహించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు యువతలో కూడా భక్తి, సంస్కృతి, సోదరభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజ సుకన య్య, మెట్టెల వారి అన్నదమ్ములు, తొలి సమయం పత్రిక విలేఖరి, ధనకొండ రవి. గ్రామపంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొని శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. దీంతో సుదిమల్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వాలి

**పోలారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట**

**ఏఐకెఎంఎస్--పి వై ఎల్ ఆందోళన.**

**తొలి సమయం, పోలవరం; సెప్టెంబర్, 06:**




పోలారం, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఏ ఐ కె ఎమ్ ఎస్ --పి వై ఎల్ ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లందు మండలం పోలారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ .ఐ .కె .ఎం .ఎస్. మండల నాయకుడు, పోలారం మాజీ సర్పంచ్ కామ్రేడ్ వాంకుడోతు సోరట్, పి .వై. ఎల్. నాయకులు రమేష్, మంగీలాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 24 గంటల ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వం రోజుకు కేవలం 11 గంటల విద్యుత్ సరఫరా చేయడం వల్ల పంటలకు పూర్తిస్థాయిలో నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



ముఖ్యంగా మొక్కజొన్న పంట కంకి దశలో ఉందని, ఈ సమ యంలో నిరంతర విద్యుత్ సరఫరా లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 11 గంటల విద్యుత్ సరఫరాతో రోజుకు ఒక ఎకరం భూమికి కూడా పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని పేర్కొన్నారు. లో వోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.రైతు ప్రజా ప్రభుత్వమని చెప్పుకుం టున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ ఎందుకు అందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఏ .ఐ .కె .ఎమ్. ఎస్. ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఐ. కె .ఎం. ఎస్. ఇల్లందు మండల నాయకులు మంగ్య, రమేష్, మంగీలాల్, రాంబాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**జేఏసీ బి వెంకట్ రామ్ పిలుపు.**

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్. 06**

ఇల్లందు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లందులోని ట్రూఖీ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్ ఫెడరేషన్) జోనల్ కార్యాలయంలో జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ వంటి అంశాల్లో కాలయాపన చేస్తూ, పీఆర్సీ ఇచ్చినట్లు ప్రచారం చేస్తోందని విమర్శించారు. పీఆర్సీ నివేదిక గడువు 01.07.2023తో ముగిసినప్పటికీ ఇప్పటివరకు కొత్త పీఆర్సీ అమలు చేయలేదన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిత్యావసర వస్తువుల ధరల ఆధారంగా ప్రకటించాల్సిన కరువు భత్యం (డీఏ) విషయంలోనూ





ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, +ూ 317 ద్వారా ఏర్పడిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, +ూ నంబర్ 25ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ కలం బలాన్ని, ఉద్యమ స్ఫూర్తిని చూపించాలని నాయకులు కోరారు. ఈ నెల 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ జిల్లా కన్వీనర్ బి. మోహన్, జయరాజు, బి. వెంకట్రాం, పి. సర్వేశ్వరరావు, జి. రాజు, ఎ. రాంబాబు, కే. కృష్ణయ్య, వి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు యుగంధర్ యాదవ్ కీ సన్మానం



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 6:**
కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యుగంధర్ యాదవ్ మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ సభ్యులుగా ఎన్నికై సందర్భంగా అదే గ్రామానికి చెందిన కాగజ్ నగర్ డీఎఫ్ఓ ఫారెస్ట్ ఏ సి ఎఫ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అప్పయ్య, సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్పుల సునీత కుమారస్వామి, ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య, మాజీ సర్పంచ్ మహేశ్వారచారి ,బిఆర్ఎస్ నేతలు బండారు గోపినాథ్,ఎర్పుల మహేందర్, ఎసల్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కూన మల్లమ్మకు మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పరామర్శ



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 6:**
కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్ డైరెక్టర్ పూన భద్రాద్రి తల్లి కూన మల్లమ్మ మరణించిగా విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పరామర్శించారు.వారి వెంట ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాద్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ కమటం శ్రీనివాస్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రవీందర్ రెడ్డి,కౌన్సిలర్లు రావుల వినయ్ రెడ్డి,మేకల సురేష్,కల్వల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలి



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 6:**
కేసముద్రం మునిసిపాలిటీ పరిధి సబ్ స్టేషన్ తండాలోని హెచ్ పి ఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు అజ్మీరా బాలు నాయక్ మాట్లాడుతూ అతిపెద్ద గిరిజన జిల్లా అయిన మానుకోట జిల్లాలో ఇద్దరూ ఎస్టీలు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని వారిలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షులు అజ్మీర బాలునాయక్ నరసింహ గూడెం మాజీ సర్పంచ్ తేజావత్ అరుణ్ పాండియన్, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు

## ఆల్ ఇండియా ఆదివాసీ ప్రొఫెషనల్ గ్రూప్ తెలంగాణ ,మహారాష్ట్ర రాష్ట్రాల ఇన్-చార్జ్‌గా మహబూబాబాద్ జిల్లావాసి భూక్య శోభన్‌బాబు.

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 6:**



ఆల్ ఇండియా ఆదివాసీ ప్రొఫెషనల్ గ్రూప్ తెలంగాణ , మహారాష్ట్ర రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా భూక్య శోభన్‌బాబును జాతీయ ఆదివాసి అధ్యక్షుడు డాక్టర్ విక్రాంత్ భూరియా నియమించారు.మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలానికి చెందిన భూక్య శోభన్ బాబు ప్రస్తుతం ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.తెలంగాణ, మహారాష్ట్ర ఆదివాసీ ప్రొఫెషనల్ గ్రూప్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా వివిధ రంగాల్లో స్థిరపడిన ఆదివాసీ ప్రొఫెషనల్స్‌ను గుర్తించి, వారిని ఒక బలమైన నెట్‌వర్క్‌గా అనుసంధానం చేయడమనేని తన లక్ష్యమని శోభన్‌బాబు తెలిపారు.డాక్టర్లు,ఇంజినీర్లు, న్యాయవాదులు, ఐటీ నిపుణులు, విద్యావేత్తలు ఒక వేదిక మీదికి తీసుకరావడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. పరిశోధకులు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రభుత్వ –ప్రైవేట్ రంగ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు,యువ ప్రొఫెషనల్స్‌ను ఒక వేదికపైకి తీసుకువచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి,ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మెంటార్‌షిప్, నాయకత్వ అభివృద్ధి సామాజిక సాధికారత దిశగా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని శోభన్ బాబు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ విక్రాంత్ భూరియా, ఏఐసీసీ నాయకులు కొప్పుల రాజుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.




# దంతాలపల్లిలో వెయ్యి రోజుల కాంగ్రెస్ మోసపూరిత పాలనపై బిఆర్ఎస్ యుద్ధభేరి

- కాంగ్రెస్ బాకీ కార్డుతో మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ సంచలన ర్యాలీ
- కాంగ్రెస్ కు వెయ్యి రోజులు - ప్రజలకు వెయ్యి కష్టాలు




**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 06;**
డోర్నకల్ నియోజకవర్గం దంతాలపల్లి మండల కేంద్రంలో శనివారం గులాబీ జెండాలతో దద్దరిల్లిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఆ ప్రభుత్వ వైఫల్య పాలనకు నిరసనగా భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీకి నాయకత్వం వహించారు. ఆయన రాకతో బిఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.ర్యాలీలో ప్రధాన ఆకర్షణగా బిఆర్ఎస్ నాయకులు రూపొందించిన "కాంగ్రెస్ బాకీ కార్డు" బ్యానర్ నిలిచింది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు, హామీలను ఏవీ నెరవేర్చలేదని, మహాలక్ష్మి పథకంలో నెలకు రూ. 2500, తులం బంగారం, రైతు భరోసా కింద రూ. 15,000, రూ. 2 లక్షల రుణమాఫీ, విద్యార్థినిలకు స్కూటీ, ఆటో కార్మికులకు 12000 ల రూపాయలు, యువతకు ఉద్యోగాల వంటి హామీలు ఇంకా బాకీ ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిగా ప్రజలను మోసం చేసిన వెయ్యి రోజులుగా అభివర్ణించారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు మాట తప్పడం కాంగ్రెస్ నైజమని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని కూడా కొనసాగించలేక పోతున్నారని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
బిఆర్ఎస్ పార్టీ మాత్రమే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని, కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్



చైర్మన్ శ్రీ నూకల వెంకటేశ్వర రెడ్డి, దంతాలపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ధర్మవరపు వేణు, సీనియర్ నాయకులు ఓలాద్రి మల్లారెడ్డి, వీరబోయిన కిషోర్,అంకం సోమేశ్వర రావు, సేను రాజేష్, అనిల్,నాగిరెడ్డి వెంకటరెడ్డి వీరితో పాటు దంతాలపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు గులాబీ కండువాలు, జెండాలతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సాగిన ఈ భారీ ర్యాలీని చూసేందుకు స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు. బిఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుందనే సంకేతాలను ఈ ర్యాలీ ఇచ్చిందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కాంగ్రెస్ ఇచ్చిన హామీల సాధన కోసం రాబోయే రోజుల్లో మండలంలోని ప్రతి గ్రామంలో ఇలాంటి నిరసన కార్యక్రమాలు, గడపగడప ప్రచారాలు నిర్వహిస్తామని బిఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆగదని తేల్చి చెప్పారు.

# దంతాలపల్లిలో కాంగ్రెస్ వెయ్యి రోజుల ప్రజా పాలన సంబరాలు - ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ దూకుడు

### పేదల సంక్షేమమే మా లక్ష్యం ఎమ్మెల్యే

**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 06;**
దంతాలపల్లి మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెయ్యి రోజుల ప్రజా పాలన దినోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీకి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాలు, ప్లకార్డులతో ర్యాలీ సందడిగా సాగింది. వెయ్యి రోజుల పాలనలో సాధించిన విజయాలను నినదిస్తూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు.పేదలు, రైతులు, మహిళలు, యువత, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణలో ప్రజా పాలన అంటే ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని స్పష్టం చేశారు.
ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నామని అన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, యువ వికాసం వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తోందని వివరించారు. వెయ్యి రోజుల ప్రజా పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత పాలకుల మాదిరిగా కాకుండా ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రోడ్లు, మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాల్లో విశేష ప్రగతి సాధించామని ఎమ్మెల్యే తెలిపారు. దంతాలపల్లి మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు.ప్రజల ఆశీస్సులతోనే



తాను ఎమ్మెల్యేగా గెలిచానని, వారి రుణం తీర్చుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని రామచంద్రనాయక్ పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన మరింత వేగంగా, ప్రజలకు మరింత చేరువగా సాగుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే రామచంద్రనాయక్



ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు దంతాలపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడుపుగంటి హరికృష్ణ, స్థానిక సర్పంచ్ పాన్నోటి బాలాజీ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్, జిల్లా నాయకులు గురుపాల్ రెడ్డి, ఎం. రాంరెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఆవుల సురేష్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ము వాసు, మండల యూత్ అధ్యక్షులు సంపేట సురేష్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి, ఉపసర్పంచ్ దాసరి వెంకన్న, మాజీ పిఎసిఎస్ సంపేట రాము, మాజీ ఎంపీటీసీ నెమ్మది యాకన్న, దంతాలపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్లు శ్రీనివాస్ రెడ్డి, పీసీ మోహన్, గుమ్మడవెల్లి ప్రవీణ్, బొల్లు వీరన్న, బెల్లి సంపత్, కొండ సాయి, పులుబుజ్జ ప్రశాంత్, దాసరి సందీప్, సోమారపు రామకృష్ణ, సోమారపు రామచంద్రు, సోమారపు నవీన్, నెమ్మది వెంకటేశ్వర్లు, అంకం సతీష్, మరియు మండల సమన్వయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి : జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్

- ఆక్రమణలపై అలుపెరుగని పోరాటం చేస్తా : భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు




**తొలిసమయం, హైదరాబాద్, సెప్టెంబరు 6 :**
సమాచార హక్కు చట్టం--2005 ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులపై విస్తృత అవగాహన కల్పించి, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కృషి చేయాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో కమిటీ జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంటి ముదిరాజ్ మాట్లాడుతూ నిరుపేదలు, సామాన్యులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అవసరమైన న్యాయ సహాయం, ప్రభుత్వ పథకాలపై మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అవగాహన కల్పించాలని అన్నారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు, అప్పీల్ విధానాలతో పాటు చట్టపరమైన పరిమితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రెవెన్యూ రికార్డులు,



ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువులు, శిఖం, బంచరాయి, బంజరు, పోరంబోకు, గ్రామకంఠం తదితర ప్రజా ప్రయోజన భూములకు సంబంధించిన అధికారిక రికార్డులపై సమాచారం సేకరించేందుకు ప్రజలకు సహకరించాలని సూచించారు. అక్రమ ఆక్రమణలు లేదా రికార్డుల్లో అవకతవకలకు ఆధారాలు లభిస్తే సంబంధిత అధికారులకు చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు మాట్లాడుతూ జిల్లాలో చెరువులను ఆక్రమించి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫారెస్ట్ కార్యాలయం సమీపంలోని రహదారి స్థలాన్ని ఆక్రమించడం వల్ల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. దీనిపై రాష్ట్ర కమిటీ స్పందించి, సంబంధిత రికార్డులను వెలికితీసి నక్షా ప్రకారం రహదారిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేదుల ప్రసాద్, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ సహాయ కార్యదర్శి వంగ వివేకానంద, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షురాలు పొన్నెకంటి జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రీ మారాలంటే ప్రేక్షకులు మారాలి..

## 'పెద్ది' వివాదంపై తాప్సీ కామెంట్స్!

భారతీయ సినిమాలలో మహిళలను వస్తువులుగా చూపించడంపై నటి తాప్సీ పన్ను కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం దర్శక-నిర్మాతలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులు కూడా ఈ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. 'పెద్ది', 'టాక్సిక్' వంటి చిత్రాలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.
ఒక ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు కోరుకుంటున్నదే మేము ఇస్తున్నాము అనే వాదనను చిత్ర పరిశ్రమ తరచుగా తెరపైకి తెస్తుందని చెప్పారు. జనాలు ఏది కోరుకుంటే అది ఇవ్వకపోతే డబ్బులు ఎలా వస్తాయని మేకర్స్ భావిస్తారని, ఈ ఆలోచనా విధానం వల్ల అసలు కళ, నైపుణ్యం వెనుకబడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నటులు, దర్శకులు మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేరని, సోషల్ మీడియాలో ప్రేక్షకులు వ్యవహరించే తీరు ఈ సంస్కృతి కొనసాగడానికి కారణమవుతోందని ఆమె విమర్శించారు. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, కొందరు మాత్రం ఆ చిత్రాలలోని ఫోటోలను జూమ్ చేయడం, వీడియోలలో విచిత్రమైన కోణాలను ఉపయోగించి వైరల్ చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారని తాప్సీ గుర్తుచేశారు. దీనివల్ల సోషల్ మీడియాలో అలాంటి కంటెంట్‌కు ఆదరణ ఉందని మేకర్స్‌కు సంకేతాలు వెళ్తున్నాయని చెప్పారు. కోవిడ్ మహమ్మారికి ముందు భారతీయ సినిమా మంచి పురోగతిని సాధించి ప్రపంచ స్థాయి చిత్రాలతో పోటీ పడిందని, అయితే ఇప్పుడు మళ్లీ పరిశ్రమ వెనకడుగు వేస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై చిత్రనిర్మాతలు చివరికి బాధ్యతంతా ప్రేక్షకులపైనే నెట్టేస్తారని, ఆ సమయంలో నటుల దగ్గర ఎలాంటి సమాధానం ఉండదని తాప్సీ వాపోయారు. ఈ పోరాటంలో నటులు ఒంటరివారైపోతారని, కేవలం ప్రేక్షకులు మాత్రమే తమకు సహాయం చేసి ఈ యుద్ధంలో గెలిపించగలరని ఆమె పేర్కొన్నారు.కొత్త సినిమాలు చూడండి
కాగా, రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై వచ్చిన విమర్శలు, యష్ చిత్రం 'టాక్సిక్' లో మహిళల చిత్రీకరణపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగిన తరుణంలో తాప్సీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# 'మీర్జాపూర్' సంచలనం..

## తొలి రోజే రూ.24 కోట్లు!




వెబ్ సిరీస్‌గా ప్రపంచవ్యాప్తంగా అపారమైన క్రేజ్ సంపాదించుకున్న 'మీర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, రవి కిషన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మీర్జాపూర్: ది మూవి' సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘనమైన ఓపెనింగ్స్ రాబట్టింది.

ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు భారతదేశంలో సుమారు రూ. 24.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. ఇందులో హిందీ వెర్షన్ ద్వారా రూ. 24.60 కోట్లు రాగా, తెలుగు వెర్షన్ ద్వారా దాదాపు రూ. 15 లక్షలు వచ్చాయి. ఇక ఈ సినిమా తొలి రోజు గ్రాస్ వసూళ్లు రూ. 29.70 కోట్లను దాటాయి. ఈ బలమైన ఓపెనింగ్‌తో 'మీర్జాపూర్: ది మూవి' 2026 సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. గత నెలలో వచ్చిన ఇమ్రాన్ హాష్మీ 'ఆవారాపన్ 2' సినిమా తొలి రోజు రూ. 22 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, మీర్జాపూర్ ఆ రికార్డును వెనక్కి నెట్టింది. అయితే, రూ. 30 కోట్ల ఓపెనింగ్‌తో మూడో స్థానంలో ఉన్న 'బోర్డర్ 2' చిత్రానికి ఇది స్వల్ప దూరంలో నిలిచింది. ఇక 'టాక్సిక్', 'ధురంధర్ ది రివెంజ్' సినిమాలు వరుసగా రూ. 55 కోట్లు, రూ. 99 కోట్ల తొలి రోజు వసూళ్లతో మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

# 18 ఏళ్ల సినీ ప్రయాణం..

## అభిమానులకు నాని స్పెషల్ ప్రామిస్, 'ది ప్యారడైజ్' క్లిప్ వైరల్



టాలీవుడ్‌లో ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా తన స్వశక్తితో ఎదిగి స్టార్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయకుల్లో నేచురల్ స్టార్ నాని ఒకరు. సహజమైన నటన, విభిన్నమైన కథల ఎంపిక, తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ తన అభిరుచిని చాటుకుంటున్న నాని.. తాజాగా తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని పూర్తి చేసుకున్నారు. నాని సినీ రంగ ప్రవేశం చేసి తాజాగా 18 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక పోస్టులు, ఎడిట్స్, వీడియోలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాని కెరీర్‌లోని కీలక చిత్రాలను గుర్తు చేసుకుంటూ.. ఆయన సాధించిన విజయాలను సెలబ్రేట్ చేశారు.

ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టి.. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత హీరోగా మారి నేచురల్ స్టార్‌గా ఎదిగిన నాని ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. వరుస విజయాలతో పాటు వైవిధ్యమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ క్రియేట్ చేసుకున్నారు. తన 18 ఏళ్ల సినీ ప్రయాణంపై నాని కూడా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 18 ఏళ్లు పూర్తవడంతో సినిమాల్లో తాను ఇప్పుడు పెద్దవాడినయ్యాననే భావనను సరదాగా వ్యక్తం చేశారు. సాధారణంగా 18 ఏళ్లు దాటితే అడల్ట్ అంటారు కదా.. అదే విధంగా టాలీవుడ్‌లో కూడా తనకు 18 ఏళ్ల వయసు వచ్చినట్లుగా నాని సరదాగా చెప్పుకొచ్చారు.అయితే ఈ సందర్భంగా ఆయన చేసిన మరో కామెంట్ అభిమానులను మరింతగా ఆకట్టుకుంది. ఇన్నేళ్లుగా తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమను ఎప్పటికీ తేలికగా తీసుకోనని నాని స్పష్టం చేశారు.

తన కెరీర్‌లో అభిమానుల పాత్ర ఎంతో కీలకమనే విషయాన్ని నాని మరోసారి గుర్తు చేసుకున్నారు. తనపై ప్రేక్షకులు, అభిమానులు చూపిస్తున్న ప్రేమను తాను ఎప్పుడూ అలుసుగా తీసుకోలేదని.. భవిష్యత్తులోనూ తీసుకోనని ప్రామిస్ చేశారు.18 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా నాని చేసిన ఈ మాటలు అభిమానులకు బాగా కనెక్ట్ అయ్యాయి. స్టార్ హీరోగా ఎదిగిన తర్వాత కూడా అభిమానుల ప్రేమకు ఇంత విలువ ఇస్తూ మాట్లాడటంతో సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.ఇక తన 18 ఏళ్ల సినీ ప్రయాణానికి సంబంధించిన ఈ ప్రత్యేక సందర్భాన్ని నాని తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్'కు సంబంధించిన క్లిప్‌తో పంచుకోవడం మరింత ఆసక్తిని పెంచింది. సినిమా నుంచి షేర్ చేసిన ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.

### భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత

# పొడవైన టైటిల్‌తో సినిమా..

## 'ఆ నలుగురు' దర్శకుడి కొత్త ప్రయోగం!



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ మరో వినూత్న ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'ఆ నలుగురు', 'మధుమాసం', 'అందరి బంధువయా', 'ఆటగదరా శివా' వంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, తాజాగా 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు' అనే హై-కాన్సెప్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రానికి దర్శకత్వం వహించారు. 'ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా' అనేది దీనికి ఉప శీర్షిక. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై చంద్ర సిద్ధార్థ్ స్వయంగా నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఇది కేవలం సినిమా మాత్రమే కాదని, భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో వస్తున్న తొలి చిత్రమని యూనిట్ చెబుతోంది. ప్రముఖ దివంగత దర్శక-రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. మదన్ తన చివరి రోజుల్లో ప్లాన్ చేసిన ఈ కథాంశంపై చంద్ర సిద్ధార్థ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఒకప్పుడు మదన్ అందించిన కథతోనే 'ఆ నలుగురు' వంటి క్లాసిక్ చిత్రాన్ని తీసిన చంద్ర సిద్ధార్థ్, ఇప్పుడు మరోసారి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు.

ఈ చిత్ర కథాంశం అత్యంత ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతిరోజూ రాత్రి సరిగ్గా పదిన్నర గంటలకు ఒక నిర్దిష్ట రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతూ ఉంటుంది. ఆ పాటను నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగు వారు కోరుతుంటారు. ఈ విభిన్నమైన కాన్సెప్ట్ ఆధారంగానే సినిమా టైటిల్‌ను పెట్టడం విశేషం. కేవలం వినోదం మాత్రమే కాకుండా, ఇది తెలుగు తెరపై వస్తున్న మొట్టమొదటి మిస్టరీ మ్యూజికల్ చిత్రం కావడం మరో ప్రత్యేకత. సౌండ్ థెరపీ, న్యూరోసైన్స్, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, మానవ మెదడుకు, ధ్వనికి మధ్య ఉన్న సంబంధం, అపరాధ భావన వంటి సరికొత్త అంశాలను మేళవించి దర్శకుడు ఈ మిస్టరీ కథనాన్ని తెరకెక్కించారు.

# 'లెనిన్' హీరోయిన్‌కు మోహన్‌లాల్ సినిమా ఛాన్స్..

## 'ఆపరేషన్ గంగ'తో మాలీవుడ్ ఎంట్రీ!



ఈ ఏడాది టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్న సినిమాల్లో 'లెనిన్' కూడా ఒకటిగా నిలిచింది. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ చిత్రం ఇద్దరి కెరీర్‌లోనూ కీలకంగా మారింది.
చాలాకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, భాగ్యశ్రీలకు ఈ సినిమా మంచి కంబ్యాక్‌ను అందించింది. ముఖ్యంగా ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే తన అందం, నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'లెనిన్' తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయని భావించిన సమయంలోనే ఈ బ్యూటీ మరో భారీ ప్రాజెక్ట్‌ను సొంతం చేసుకున్నారు. అది కూడా మాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో మోహన్‌లాల్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం కావడం విశేషం.కొత్త సినిమాలు చూడండి
మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కనున్న భారీ చిత్రం 'ఆపరేషన్ గంగ'లో భాగ్యశ్రీ బోర్సే కీలక పాత్రలో నటించనున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు.. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం ద్వారా ఆమె మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు. ఇప్పటికే 'లెనిన్'తో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న భాగ్యశ్రీ.. ఇప్పుడు మోహన్‌లాల్ లాంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం దక్కించుకోవడంతో ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారనుంది.అయితే సినిమాలో ఆమె పోషించబోయే పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. దీంతో మోహన్‌లాల్‌తో ఆమె స్క్రీన్ షేర్ చేసుకునే విధానం ఎలా ఉంటుంది? ఆమె పాత్ర కథలో ఎంత కీలకంగా ఉండబోతోంది? అనే ఆసక్తి నెలకొంది. 'ఆపరేషన్ గంగ' సినిమాను దర్శకుడు విష్ణు మోహన్ తెరకెక్కించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. నిజ జీవితంలో జరిగిన సంఘటనను నేపథ్యంగా తీసుకుని తెరకెక్కుతున్న సినిమా కావడంతో కథపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. భారీ స్థాయిలో రూపొందించనున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? దర్శకుడు విష్ణు మోహన్ కథను ఏ విధంగా తెరపై ఆవిష్కరించబోతున్నారు? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాకు సంగీతం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉంది. 'ధురంధర్' వంటి భారీ చిత్రానికి సంగీతం అందించిన సస్వత్ సింగ్ సచ్ దేవ్ 'ఆపరేషన్ గంగ'కు మ్యూజిక్ అందించనున్నట్లు సమాచారం.

# వెంకీ, కళ్యాణ్ రామ్ మూవీకి లీకుల బెడద..

## సెట్ నుండి బయటకొచ్చిన సాంగ్ వీడియోలు!




స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న క్రేజీ మల్టీస్టారర్ మూవీ జనవరి 12న విడుదల. అనిల్ రావిపూడి సినిమాలకు ఉండే కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్‌కు తోడు.. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.అయితే సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతున్న సమయంలోనే చిత్రబృందానికి కొత్త సమస్య ఎదురైంది. 'జనవరి 12 విడుదల' షూటింగ్‌కు లీకుల బెడద మొదలైనట్లు తెలుస్తోంది. తాజాగా సాంగ్ షూటింగ్‌కు సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది.

ప్రస్తుతం 'జనవరి 12 విడుదల' సినిమా షూటింగ్ మైసూర్‌లో జరుగుతున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో వెంకటేశ్, కల్యాణ్ రామ్‌తో పాటు హీరోయిన్లు కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. తాజాగా వీరంతా కలిసి ఓ పాట షూటింగ్‌లో పాల్గొన్న సమయంలో తీసిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలోకి లీక్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...